క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ వద్ద ఆందోళన

కడప వైఎస్సార్ సర్కిల్ : అర్హులైన పేదలకు సాగు భూమిని పంపిణీ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిర్వహించనున్న ఆందోళనను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర కోరారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో పేదలకు రెండు ఎకరాల సాగు భూమిని పంచేందుకు నిరాకరిస్తున్న అధికారులు విలువైన దేవదాయ, వక్ఫ్, వాగు వంటి అసైన్‌మెంట్ భూములపై తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమంగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

దేవుని కడప ఆలయ అధికారి అవార్డుకు ఎంపిక


ఈశ్వర్‌రెడ్డి

కడప కల్చరల్ : తిరుమల తొలిగడపగా భావిస్తున్న దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇన్‌స్పెక్టర్‌గా సేవలు అందిస్తున్న ఈశ్వర్ రెడ్డి స్వాతంత్య్ర దినోత్సవ అవార్డుకు ఎంపికయ్యారు. ఆదివారం టీటీడీ అధికారులు ఆయనకు ఈ మేరకు సమాచారం అందజేశారు. ఆగస్టు 15న టీటీడీ ఈఓ లేదా చైర్మన్ ఆయనకు ఈ అవార్డును అందజేయనున్నారు.

ట్యాలీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఫౌండేషన్ అడ్మిషన్స్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారు ఈ శిక్షణకు అర్హులన్నారు. 35 రోజులపాటు కొనసాగే శిక్షణా కాలంలో అభ్యర్థులు 18 నుంచి 26 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. శిక్షణలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీషు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో కూడా శిక్షణ ఇస్తామన్నారు. ఇతర వివరాలకు 90004 87423 నంబరులో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కడప కార్పొరేషన్ : చింతకొమ్మదిన్నె మండలంలోని మూలవంక 132 కేవీ సబ్ స్టేషన్‌లో అత్యవసర మరమ్మతుల కారణంగా రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి, ఐటీ పార్కు, మూలవంక, చిలేకాంపల్లె, నాగిరెడ్డిపల్లె, క్రిష్ణాపురం, తెలుగు గంగ ప్రాజెక్టు కాలనీల్లో సోమవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని రూరల్ సబ్ డివిజన్ డీఈఈ క్రిష్ణదేవ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి తమకు సహకరించాలని కోరారు.

శాకాహారం ఆరోగ్యకరం

కడప కల్చరల్ : శాకాహారం ఆరోగ్యానికి ఎంతో మంచిదని కడప పిరమిడ్ స్పిరుచ్యువల్ సొసైటీ ప్రతినిధులు అన్నారు. ఆదివారం సొసైటీ సభ్యులు కడప నగరంలో శాకాహార ర్యాలీ నిర్వహించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఊర్మిళాదేవి, సీనియర్ పిరమిడ్ మాస్టర్లు ఓబయ్య ఆధ్వర్యంలో ర్యాలీలో పాల్గొన్న వారు మాంసాహారం వద్దు–శాకాహారం ముద్దు అనే నినాదాలు చేస్తూ సాగారు. సొసైటీ సలహాదారులు జీవీఎస్ రెడ్డి, జీఆర్ఎస్ రెడ్డి, మాస్టర్లు రమణ, బాలాజీ, సంజీవి, మురళి, ప్రసాద్, ప్రభాకర్, షర్వాణి, జయలక్ష్మి, శ్యామల, కృష్ణవేణి తదితరులు ఇంటింటికి వెళ్లి శాకాహారం చేసే మేలు గురించిన కరపత్రాలు అందజేసి వివరించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట–బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతోపాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

వాటర్ ట్యాంకర్‌తో తాగునీటి సరఫరా

సిద్దవటం : మాధవరం–1 గ్రామ పంచాయతీకి పెన్నా నది నుంచి వచ్చే తాగునీరు అందకపోవడంతో ఆదివారం గ్రామ సర్పంచ్ జానకిరామయ్య ఆధ్వర్యంలో ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీరు అందిస్తున్నామని గ్రామ పంచాయతీ కార్యదర్శి చేపూరి లక్ష్మీనరసయ్య తెలిపారు. సిద్దవటం పెన్నానది నుంచి మాధవరం–1కు సరఫరా చేసే తాగునీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురికావడంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన అన్నారు.

పని చేయని తాగునీటి పథకం..

విద్యార్థులకు తప్పని తిప్పలు


గాండ్లవీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాల


పాఠశాలలో పనిచేయని మంచినీటి శుద్ధియంత్రం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం గాండ్లవీధిలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో మంచి నీటికి విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 5వ తరగతి వరకు 180 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి దాహార్తిని తీర్చేందుకు అధికారులు రూ.లక్షా 80 వేలు విలువ చేసే మంచి నీటి శుద్ధి యంత్రాన్ని మంజూరు చేసి ఏర్పాటు చేశారు. ఇది కొద్ది రోజులు పనిచేసి తరువాత పనిచేయకుండా పోయింది. విద్యార్థులు మంచినీటికి ఇబ్బందులు పడుతుండటంతో పాఠశాల హెడ్ టీచర్ మరమ్మతు చేయించారు. ఇది కొద్ది రోజులు పనిచేసింది. ఆ తరువాత మళ్లీ పనిచేయకుండా పోయింది. దీంతో పాఠశాల సమయంలో విద్యార్థులు మంచినీరు తాగడంతోపాటు మధ్యాహ్నం భోజనం తినేందుకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో పాఠశాల హెడ్ టీచర్ బయటి నుంచి రోజూ రెండు వాటర్ క్యాన్‌లతో నీటిని తెప్పించి దప్పిక తీరుస్తున్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి మంచినీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హజ్ తర్వాత పవిత్ర జీవితం



మాట్లాడుతున్న మత గురువు ముఫ్తీ సయ్యద్ అహ్మద్ బాఖ్వీ

కడప కల్చరల్ : ముస్లింలు తమ కలల పంటగా జీవితంలో హజ్ యాత్ర తర్వాత పవిత్రమైన జీవితాన్ని గడపాల్సి ఉంటుందని మత గురువు ముఫ్తీ సయ్యద్ అహ్మద్ బాఖ్వీ అన్నారు. ఆదివారం స్థానిక బెల్లం మండిలోని మదరసా–యే–జహారాలో జమా అతె ఇస్లామి హింద్ కడపశాఖ ఆధ్వర్యంలో ఆయన జిల్లా నలుమూలల నుంచి పవిత్ర హజ్ యాత్ర ముగించుకుని వచ్చిన వారికి పలు సూచనలు చేశారు. హజ్ యాత్ర చేసిన వారందరూ అంతవరకు జీవితంలోని లోపాలు, పాపాలను గుర్తించి ఇకపై అలాంటివి ఎదురు కాకుండా చూసుకోవాలని, పూర్తి స్థాయిలో ఉత్తమ జీవితం గడిపేందుకే ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు నీతి నిజాయితీ పాటించాలని, పాలకులైతే ప్రజా సంక్షేమమే ధ్యేయంగా భావించాలని, పేదలకు కూడా సహాయ సహకారాలు అందించి దాన ధర్మాలు చేయాలని సూచించారు. మనం చేసే ప్రతి పని దైవం చూస్తుంటాడని, ప్రతి తప్పుకు మరణానంతరం దైవానికి జవాబు చెప్పుకోవాల్సి ఉంటుందన్నారు. పవిత్రమైన జీవితం గడిపినపుడే హజ్ యాత్రకు సార్థకత చేకూరినట్లన్నారు. సభాధ్యక్షులు, సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షులు మౌలాన సయ్యద్ ఇందాదుల్లా హుసేనీ మాట్లాడుతూ ప్రజలంతా కలిసి మెలిసి ఉండాలని, దేశాభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. జమా అతె ఇస్లామి హింద్ అధ్యక్షుడు ఎస్.ఖాదర్‌వలీ, మాజీ అధ్యక్షుడు రియాజ్‌బాషా, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు పీఎస్ రహమతుల్లా, సంస్థ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నగరాన్ని 'నీమ్' సిటీగా మారుద్దాం

కడప కల్చరల్ : కడప నగరాన్ని నీమ్ సిటీగా మార్చేందుకు ఆసక్తిగల వారు, పర్యావరణ మిత్రులు కలిసి రావాలని పర్యావరణ మిత్ర సమూహ సొసైటీ ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి కోరారు. ఆదివారం స్థానిక రాజీవ్ పార్కులో ఆయన సొసైటీ ఇతర సభ్యులతో కలిసి సమావేశం నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం కోసం ఎకో ఫ్రెండ్స్ గ్రూప్ సొసైటీని ఏర్పాటు చేశామన్నారు. ఫోన్ కొట్టు–మొక్క పట్టు పేరిట మొక్కలను అందజేసే కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా కనీసం 15 రోజుల్లో ఫోన్ ద్వారా తెలియజేస్తే వారు సూచించిన చిరునామాకు నేరుగా తమ ప్రతినిధి వెళ్లి వేప మొక్క లేదా ఇతర మొక్కను అందజేస్తారన్నారు. సభ్యులు భరత్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, సురేంద్ర, మహేశ్వర్‌రెడ్డి, సజ్జాద్‌ఖాన్, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నూర్‌బాషా సంఘం జిల్లా కార్యదర్శిగా రాయపాటి దస్తగిరి

పులివెందుల టౌన్ : నూర్‌బాషా సంఘం జిల్లా కార్యదర్శిగా రాయపాటి దస్తగిరిని నియమిస్తూ ఆదివారం స్థానిక నూర్‌బాషా దూదేకుల సంఘం కార్యాలయంలో ఆ సంఘ ఉమ్మడిరా ష్ట్రాల నూర్ బాషా సంఘ అధ్యక్షుడు ఓతూరు రసూల్‌సాహెబ్ నియామక పత్రాన్ని అందజేశారు. ముద్దనూరు మండలం కోనాపురం గ్రామ ఉప సర్పంచ్ రాయపాటి దస్తగిరికి సంఘ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా దస్తగిరి మాట్లాడుతూ దూదేకుల సమస్యల పరిష్కారం కోసం పోరాడతానన్నారు.

లంకమల అభయారణ్యంలో కూంబింగ్


కూంబింగ్ నిర్వహిస్తున్న రేంజర్ కళావతి, సిబ్బంది

సిద్దవటం : సిద్దవటం రేంజ్‌లోని లంకమల అభయారణ్యంలో ఆదివారం కూంబింగ్ నిర్వహించామని సిద్దవటం రేంజర్ బి. కళావతి తెలిపారు. ఈ సందర్భంగా అటవీశాఖ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ మద్దూరు, సిద్దవటం బీట్లలో సాబ్బావి బేస్ క్యాంప్‌ను తనిఖీ చేశామన్నారు. అనంతరం సిబ్బందితో కలిసి సాబ్‌మోర, ఎర్రమసికలు, మద్దూరు బీటు సరిహద్దు, కాలిబాటల రస్తా ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించామన్నారు. ఎక్కడా కూడా స్మగ్లింగ్ ఆనవాళ్లు కనిపించలేదని ఆమె తెలిపారు. డిప్యూటీ రేంజర్ కె. ఓబులేస్, ఫారెస్టు బీట్ అధికారి రాజశేఖర్ రెడ్డి, సాబ్బావి, సిబ్బంది పాల్గొన్నారు.

బహుముఖ ప్రతిభాశాలి డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్


డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : వృత్తిరీత్యా ఐఏఎస్ అధికారి అయినా పరిశోధన ప్రవృత్తిగా కలిగి తెలుగు, ఆంగ్లంలో వందకుపైగా రచనలు చేసిన డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ బహుముఖ ప్రతిభాశాలి అని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆదివారం డాక్టర్ ఎక్కిరాల వేదవ్యాస్ 90వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేదవ్యాస్ చిత్రపటానికి పూలమాల అలంకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేదవ్యాస్ గొప్ప ఉపన్యాసకుడు, ఆధ్యాత్మిక పరిశోధకుడు, యోగా, ఆధ్యాత్మిక గురువు అని కొనియాడారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అర్థంతోసహా భారతీయ ధర్మాన్ని విద్యాభ్యాసంలో భాగంగా నేర్చుకోవాలన్నారు. బ్రౌన్ కేంద్రం లైబ్రరీ అసిస్టెంట్ రమేష్‌రావు మాట్లాడుతూ భారతీయ రుషుల విజ్ఞానాన్ని సామాన్య జనం చెంతకు తీసుకు వెళ్లేందుకు వేదవ్యాస్ ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, లైబ్రరీ అసిస్టెంట్ హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్లు వెంకటరమణ, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

శిల్పారామంలో విద్యార్థుల ప్రదర్శనలు



నృత్యాన్ని ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, విద్యార్థులు తమ ఆటపాటలతో సందడి చేశారు. చిత్తూరు జిల్లాకు చెందిన బైరెడ్డిపల్లె కళా తరంగిణి బృందం సభ్యులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. మంగళవారం భారత స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు దేశభక్తి గీతాలకు కూడా నృత్యాలను ప్రదర్శించారు. సామాజిక అంశాలపై పలు కామెడీ స్కిట్‌లను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఆగస్టు 15న ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

కేఓఆర్‌ఎం అధ్యాపకులకు ప్రశంసాపత్రాలు


ప్రశంసాపత్రాలు సాధించిన అధ్యాపకులతో ప్రిన్సిపాల్ ఆకుల గిరిధర్

కడప ఎడ్యుకేషన్: సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్, పూనే, భారత ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ వారు సంయుక్తంగా కడప నగర శివార్లలోని కేఓఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు సర్టిఫికెట్ కోర్సు నిర్వహించారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ ఆగ్మెంటెడ్ అండ్ వర్చువల్ రియాలిటి అనే అంశాలపై జరిగిన ఈ సర్టిఫికెట్ కోర్సులో కేఓఆర్‌ఎం అధ్యాపకులు పాల్గొని తమ ప్రతిభ చాటారు. ఇందులో అధ్యాపకులు తులసీకృష్ణ, అమీనుల్లా, గంగాలత, వెంకటకృష్ణ, రాధిక, రమేష్‌బాబు, రజిత, హరితలు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సుపై రెడ్డి మురళి, శారికబేగం, కిషోర్‌రెడ్డి, ప్రసన్నలు ఆగ్మెంటెడ్ అండ్ వర్చువల్ రియాలిటి మీద ట్రైనింగ్ తీసుకుని పరీక్షలు రాశారు. ఈ పరీక్షల్లో అందరూ గోల్డ్, సిల్వర్ గ్రేడ్‌లలో ఉత్తీర్ణులు అయినందుకు కళాశాల చైర్మన్ వెంకట శివారెడ్డి, సెక్రటరీ లిఖిత రెడ్డి, ప్రిన్సిపాల్ ఆకుల గిరిధర్ హర్షం వ్యక్తం చేసి వారిని అభినందించారు.

పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలి


మాట్లాడుతున్న 11వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: తల్లిదండ్రులు పిల్లల పట్ల చూపే ప్రేమ వారి ఉజ్వల భవిష్యత్తుకు దారిచూపే విధంగా ఉండాలని 11వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం కడపలోని మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో పదవ తరగతికి సంబంధించి 1988–89 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కమాండెంట్ మాట్లాడుతూ తాము చదువుకునే రోజుల్లో గురువులు, పిల్లల మధ్య చక్కటి సంబంధాలు ఉండేవన్నారు. గురువులంటే భయభక్తుతో ఉంటూ విద్యనభ్యసించేవారమన్నారు. అందుకే ఈ రోజు ఈ స్థితిలో ఉన్నామన్నారు. నాటి గురువులు ఎల్లారెడ్డి, రాఘవయ్య, నాగమణిలు మాట్లాడుతూ తమ వద్ద చదువుకున్న పిల్లలంతా సుఖ సంతోషాలతోపాటు ఆయురారోగ్యాలతో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులరెడ్డి, హరి, వేణు, నాగరాజు, అయ్యవారయ్య, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ మారెమ్మ మందిర ఆవిర్భావ ఉత్సవం


మారెమ్మ తల్లి ఆలయంలో పూజలకు హాజరైన భక్తులు

కడప కల్చరల్ : స్థానిక ఎర్రముక్కపల్లెలోని జగజ్జనని మారెమ్మ తల్లి మందిర 156వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కడప నగరంతోపాటు జిల్లా నలుమూలల నుంచి మారెమ్మ భక్తులు కార్యక్రమానికి హాజరయ్యారు. పలువురు పూజాద్రవ్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సంప్రదాయంగా అమ్మవారికి చల్లను ఊరేగింపుగా తెచ్చి సమర్పించి అర్చకుల ద్వారా దానినే తిరిగి ప్రసాదంగా స్వీకరించారు. గుంతకల్లుకు చెందిన సీఆర్‌పీ కానిస్టేబుల్ రామాపురం కన్నయ్య కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి త్రిశూలాన్ని సమర్పించారు. భువనేశ్వరీమాత ఉపాసకులు నాగేంద్రస్వామి, ఆదినిమ్మాయపల్లె శంకర్‌రెడ్డి, బుద్ధాయపల్లె బసిరెడ్డి, బాచుపల్లె జగన్‌మోహన్‌రెడ్డి, ఖాజీపేట ఈశ్వర్‌రెడ్డి, పుష్పగిరి ధర్మపరిరక్షణ సేన సభ్యులు సత్తి భాస్కర్, వరప్రసాద్, బాలకృష్ణ, బాలు, న్యాయవాదులు జీవీ చలపతి, శ్రీనివాసులు, సులోచన, పూర్వ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామాంజనేయరెడ్డి, రవీంద్ర, రవి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్‌తో 'హరిత'.. జగన్‌తో ఒబెరాయ్


ఇంటాక్, లయన్స్ నూతన కమిటీ ప్రతినిధులకు సత్కారం

కడప కల్చరల్ : డాక్టర్ వైయస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గండికోటలో హరిత హోటల్ నిర్మించి పర్యాటకంగా దాని అభివృద్ధికి బలమైన పునాదులు వేశారని ప్రస్తుతం ఆయన కుమారుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అక్కడ ఒబెరాయ్ హోటల్ నిర్మింపజేసి ఆ ప్రాంతానికి విశ్వవ్యాప్తంగా ప్రచారం కల్పిస్తున్నారని గండికోట వారసత్వ అభివృద్ధి ప్రాధికార సంస్థ చైర్మన్ పెమ్మసాని ప్రభాకర్ నాయుడు అన్నారు. జిల్లా పర్యాటక ప్రాంతాల అభివృద్ధి అనే అంశంపై ఆదివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు ఆధ్వర్యంలో స్థానిక గ్రాండ్ ఇన్ హోటల్‌లో చర్చా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ నాయుడు మాట్లాడుతూ గండికోటకు ఒకటి చేస్తే అది పదింతల లాభం చేకూరుస్తుందని ప్రజల్లో ఓ సెంటిమెంట్ ఉందని, అది ప్రస్తుత ప్రభుత్వం విషయంలో మరో మారు నిజం కాబోతున్నదని అభిప్రాయపడ్డారు. గండికోట అభివృద్ధిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళుతున్నారు కనుక రాష్ట్రంలో మళ్లీ వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వమే వస్తుందని ఈ సెంటిమెంట్ వెనుక ఎంతో బలమైన విశ్వాసం ఉందని తెలిపారు. చర్చా కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ గండికోటతో పాటు జిల్లా పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిపెట్టి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అధికారులు కూడా జిల్లా పర్యాటకాభివృద్ధి పట్ల ఎంతో ఉత్సాహం చూపుతున్నారన్నారు. రాయలసీమ టూరిజం సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లా పర్యాటక రంగాన్ని డాక్యుమెంటేషన్ చేసేందుకు తమ వంతు సహకారం అందించగలమన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన పర్యాటక అభిమానులు ముడియం కిషోర్, యల్లేశ్వరరావు, గంగాధర్, కేవీ రమణారెడ్డి, సిహెచ్. వెంకటేష్, మునికుమార్ తదితరులు పర్యాటక ప్రాంతాలపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. ఇంటాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ గా ఎంపికైన కె. చిన్నపరెడ్డిని, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షునిగా ఎన్నికైన పోతుల వెంకటరామిరెడ్డిని ముఖ్య అతిథి పెమ్మసాని ప్రభాకర్ నాయుడు తమ సంస్థ పక్షాన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్కార గ్రహీతలు మాట్లాడుతూ జిల్లాలోని లంకమల అటవీ ప్రాంతానికి పర్యాటకంగా గల ప్రాధాన్యతను వెలుగులోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులు గౌరి శంకర్, దేవతి రవీంద్రనాథ్, బోగాల కొండారెడ్డిలను కూడా అభినందిస్తూ సత్కరించారు.

చేనేత కార్మికులకు సత్కారం


చేనేత కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

కడప కల్చరల్ : రాయలసీమలోని పలువురు ప్రతిభ గల చేనేత కార్మికులను ఆదివారం కడప నగరానికి చెందిన చౌడం బ్రదర్స్ ఘనంగా సత్కరించారు. స్థానిక విజయనగర్ కాలనీలోని చౌడం బ్రదర్స్ చేనేత కార్మిక సంక్షేమ సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులైన లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, నాగార్జునలు మాట్లాడుతూ తమ తల్లి చేనేత కార్మికురాలిగా మగ్గం నేస్తూ ఎంతో ప్రతిభ చూపేవారని, ఆ కళను అంతరించిపోనీయకుండా తమవంతుగా రాష్ట్ర వ్యాప్తంగా అలాంటి ప్రతిభ గల కళాకారులను గుర్తించి ప్రోత్సహించేందుకు యేటా చేనేత పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో చౌడం లక్ష్మీదేవి, మల్లీశ్వరి, శారద, విజయ, శివసాయి, కలసపాడు మండలానికి చెందిన బొమ్మిశెట్టి కొండ్రాయుడు, పల్లా ఈశ్వరయ్య, కాశినాయన మండల వాసి సాన వెంకట సుబ్బయ్య, రాజుపాలెం మండల వాసి మద్దూరి చంద్రకళలను ప్రత్యేకంగా సత్కరించారు.

డీకే చదువుల బాబుకు సన్మానం


డీకే చదువులబాబును సన్మానిస్తున్న బీసీ ప్రజా చైతన్య సమాఖ్య నాయకులు

ప్రొద్దుటూరు : కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత డీకే చదువుల బాబును ఆదివారం స్థానిక బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు మాట్లాడుతూ డీకే చదువులబాబు ఉపాధ్యాయుడిగా విద్యార్థులను తీర్చిదిద్దుతూ, మరోక వైపు నాలుగు దశాబ్దాలుగా నిరంతరం సాహిత్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రధాన కార్యదర్శి జింకా మార్కండేయ మాట్లాడుతూ చదువులబాబు వివిధ ప్రముఖ పత్రికల్లో 700 కథలు, 100కుపైగా కవితలు, 50కిపైగా బాలల గేయాలు, బాలల నవలలు, నాటికలు రచించి, 21 పుస్తకాలను ప్రచురించారన్నారు. కళాభారతి నాటక సంస్థ కార్యదర్శి కొత్తపల్లి శీను, ప్రముఖ కవి ఏసీ దస్తగిరి మాట్లాడుతూ చదువుల బాబు రచనలను మహారాష్ట్రలో విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చారని, ఆయన నిరంతర కృషికి అనేక అవార్డులు, శతాధిక సన్మానాలను అందుకున్నారన్నారు. సాధు ఫౌండేషన్ అధ్యక్షుడు సాధు గోపాలకృష్ణ మాట్లాడారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య కోశాధికారి మడక సంటయ్య, కొమ్మిశెట్టి మోహన్, మూలే రామమునిరెడ్డి, భాస్కర్‌రాజు, కామనూరు రామ్మోహన్, కాశీవరపు వెంకటసుబ్బయ్య, అమృతవల్లి, దుర్గాభవాని పాల్గొన్నారు.

సచివాలయాలు.. సత్వర సేవలకు నిలయాలు



కమలాపురం 1వ వార్డు సచివాలయం

కమలాపురం : గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం తీసుకురావాలన్న ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ప్రతి 2వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. సచివాలయాల్లో 10–12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. ఇక ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. దీంతో సచివాలయాలకు దేశంలోనే మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు తక్షణం సత్వరం సేవలు అందించే నిలయాలుగా మారాయి.

సచివాలయంలో అందుతున్న సేవలు :

సచివాలయంలో ప్రభుత్వానికి సంబంధించిన వందల రకాల సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛన్ పంపిణీ, అందరికి ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు, భూమలు రీసర్వే, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్నారు. గతంలో రేషన్‌కార్డు, ఇంటి స్థలాలు లాంటి ఏ పథకం కావాలన్నా మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరిగేవాళ్లమని, ఇప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మా గ్రామంలోనే అన్ని రకాల సేవలు పొందుతున్నామని ప్రజలు సచివాలయాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న సురక్షతో అన్ని రకాల సర్టిఫికెట్లు ఉచితం :

అన్ని అర్హతలు ఉండి కూడా పథకాలు అందని వారిని గుర్తించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష.. అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టారు. ప్రతి సచివాలయం పరిధిలో వారం రోజుల పాటు ఇంటింటికి తిరిగి ప్రజలకు అవసరమైన క్యాస్ట్, ఇన్‌కం, మ్యారేజ్ సర్టిఫికెట్ తదితర 11 రకాల పత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఎవరికి ఏ పథకం రావాలన్నా అన్ని రకాల సర్టిఫికెట్లు జారీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో అధికారులు వాటిని ప్రజలకు అందజేశారు.

అన్ని పథకాలు వస్తున్నాయి



వైఎస్సార్ చేయూత పథకం మూడేళ్లుగా వస్తోంది. ఏటా రూ.18,750. అలాగే జగనన్న తోడు ఏటా రూ.10 వేలు వస్తోంది. నా మనవరాలికి అమ్మ ఒడి వస్తోంది. ప్రభుత్వం పథకాలు చాలా బాగున్నాయి. అదీ కాక ఇంటికే అన్ని సేవలు అందుతున్నాయి. గతంలో రేషన్ కార్డు కోసం మండల కార్యాలయానికి వెళ్లి నానా తిప్పలు పడే వాళ్లం. ఇలాంటి సీఎం మరిన్ని సార్లు రావాలి.

–మండ్ల పద్మావతి, తెలుగు వీధి, కమలాపురం.

తెల్లవారక ముందే పింఛన్ డబ్బులు అందుతున్నాయి



ఒకటో తారీకున తెల్లవారక ముందే వలంటీర్ రమణ ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇస్తున్నాడు. గతంలో ఈ పరిస్థితి లేదు. 1వ తేదీ పంచాయతీ ఆఫీసుకు పోతే సాయంత్రం వరకు పడిగాపులు కాసే వాళ్లం. ఆరోజు రాక పోతే మరసటి రోజు పోయే వాళ్లం. అలాగే సున్నా వడ్డీ, తోడు, చేయూత పథకాలు వస్తున్నాయి. మా కష్టాలు చూసిన జగనన్న ఇంటికే పింఛన్ పంపిస్తున్నాడు.

–ఆవుల లక్షుమ్మ, 1వ సచివాలయం కమలాపురం